# సహాయం

అందరితో 'మంచి' అన్పించుకోవడానికి... నల్గుర్లో పేరు ప్రఖ్యాతులు సంపాదించడానికి.... మనకి తెలీకుండానే పడరానిపాట్లు పడ్తూ ఉంటాం!

ఎన్ని సాయాలు చేసినా ఏరు దాటాక తెప్ప తగలేసే మనషులున్న ఈ సమాజంలో... ఏ సాయమూ చేయకుండా 'మంచివాడ'నే ముద్ర తలకిందులు తపస్సుచేసినా లభించదని తెలిసి.... కొన్నిసార్లు ఎదుటివాళ్ళకి అవసరమున్నా లేకున్నా చిన్నపనో... చితక పనో చేసిపెట్టి... వాళ్ళ మెప్పు పొందాలని ఉవ్విళ్ళూరుతాం!

ఒకవేళ వాళ్ళు మనం చేసిన సాయం మరిచిపోతే - 'అప్పుడంత సాయం చేశాను... ఇప్పుడెలా మరిచి పోయాడో చూడండీ' అని నల్గుర్లో మనం చేసిన సహాయాన్ని గుర్తుచేసి మన 'అల్పబుద్ధి'ని చూపెడ్తాం!

**ఆవగింజంత పనిచేసి ఆకాశమంత గుర్తింపు నాశించడం... కీర్తికాంక్ష.**

ఇంకొన్నిసార్లు... డబ్బు విరజిమ్మయినా కీర్తిప్రతిష్టల్ని కొనుక్కోవాలనుకుంటాం! మన వాళ్ళకి ఎడం చేత్తో ఎంగిలి విదిల్చడానికి ఇష్టపడని మనం... పరాయి వాళ్ళకి మాత్రం ఎడాపెడా దానాలు చేస్తాం! ఎవరూ చూడటం లేదనుకుంటే... పిల్లికి బిచ్చం పెట్టడానిక్కూడా నిక్కినీల్గే మనం... పరులు చూస్తున్నారంటే... వరాల సిరుల వర్షం కురిపించడానికి సిద్ధపడ్తాం!

**ఇంటివాళ్ళు పిసినారులనుకున్నా ఫర్వాలేదు... బయటి వాళ్ళు మారాజు అనుకుంటే చాలనుకోవడం.... కీర్తిదాహం.**

మరికొన్ని సార్లు మనం... మనది కాని సొమ్ముతో ఎదుటివాళ్ళకి సాయం చేసి... ఆ కీర్తి ప్రతిష్టలు మనకే దక్కాలని కక్కుర్తిపడ్తాం! పోయేది మన సొమ్ముకాదు కాబట్టి.. మనకి తరిగేదేమీ ఉండదని ఎక్కడలేని ఔదార్యం ప్రదర్శిస్తాం!

**ఎవరికో దక్కవలసిన కీర్తి ప్రతిష్ఠలు అడ్డ దారుల్లోనైనా మనకే దక్కాలని వెంపర్లాడటం.... కీర్తి కండూతి!**

నిజానికి...

అసలైన పరోపకారులెప్పుడూ ఒకరి గుర్తింపు కోసం తాపత్రయపడరు సరికదా ఈ చేత్తో ఇచ్చింది ఆ చేతికి తెలీనివ్వకుండా జాగ్రత్తపడ్తారు!

పోతే...

ఎవరికీ ఏ సాయమూ... చేయకుండా కూర్చునే కన్నా... అది...

కీర్తికాంక్షో...

కీర్తిదాహమో...

పేరేదైనా... ఏదో ఒకలా ఎదుటి వాళ్ళని కనీసం జన్మకో శివరాత్రయినా ఆదుకోవడానికి ప్రయత్నించడమే... మనిషి... తోటి మనిషికి చేసే మహోపకారం!

16-03-1995